# ప్రేమ జీవితం

శ్రీ పులిపాక జగన్నాధరావు

★

“నన్నుగురించి చెప్పమంటారా! ఐతే నాజీవితంలో ‘చంద్రవాణి’ అనే మనిషిమీది నా ప్రేమా, ఆ జీవితానికీ మించి నాకేమీ అనుభవం కాలేదు. దాన్నిగురించీ, నా మనస్థితిని గురించీ చెబుతాను. చంద్రవాణికోసం నాజీవశక్తి యావత్తూ ఇరవయ్యో ఏటనుంచీ నరనరాలా కలవరించేది. తరువాత నేను బ్రతికిన ఐదేళ్లూ సాధ్యపడని, సానుకూలపడని ‘ప్రేమ’ అనే ఈ పిచ్చిని నిత్యం నిరశిస్తూనే చంద్రవాణికోసం వేదనతో చేతులు చాపేవాణ్ణి. మీరు నన్ను ఎగతాళి చెయ్యవచ్చును గాని, చంద్రవాణికోసం ఫరిగత్తే నా మనస్సును పట్టపగ్గాలుండేవి కావు. ఈ ప్రేమ సాధ్యపడదని, సానుకూలపడదని నేను మీతో ఎందుకన్నానంటే నామీద ఉంచుకోగల అభిమానాన్నంతటితోనూ నాది బొత్తిగా రూపం, కళాకాంతులూ లేని శరీరం అని మీకు చెబుతున్నాను. ఐనప్పుడు చంద్రవాణిలాంటి చక్కదనంగల మనిషిని, అదీగాక యోగ్యుడైన మరో వ్యక్తి భార్యయైన చంద్రవాణిని నేను పొందటం ఎలా సాధ్యపడుతుంది? సానుకూలపడుతుంది? నువ్వు చంద్రవాణిని ఎప్పుడు ఎలా ప్రేమించ మొదలు పెట్టావు? అని మీరడిగితే ఆ ప్రశ్నకు నేను సమాధానం చెప్పలేను. నేను చంద్రవాణిని దాన్ని చూసిన తరువాత ఏక్షణంనుంచైనా ప్రేమించ మొదలుపెట్టి వుండవచ్చును. చంద్రవాణి నన్నంత పిచ్చివాణ్ణి చేయటం దానితప్పూ, నాతప్పూ కాదనుకుంటాను. కాని ఏక్షణంనుంచీ నన్నీ ప్రేమవయ్యాంలాగా పట్టుకుందో ఆక్షణంనుంచే నేనీ ప్రేమ నాబాగుకువచ్చింది అని నిర్ధారణ చేసుకున్నాను. అప్పటినుంచీ నేను జీవితంపై కాస్తో కూస్తో విరక్తితో ఉండేవాణ్ణి. నేను నా అంత ఆస్థిని బీదసాదలపరం కేవలం ఆ బంధాలనూ, బాధ్యతలనూ తెంచుకోటానికే చేశాను. అది చాలామందికి సహాయపడటానికి నేను చాలా ఆనందించాను. నేను పాతికేళ్ళకే చనిపోవటం నాకేమీ విచారాన్ని కలగచేయలేదు సరికదా, పైగా బాధేమీ లేకుండా నాలోని జీవి శరీరాన్ని అలా విడవటం అదృష్టంగా కూడా భావించాను. మనిషికి కావాల్సిందేమిటి? సత్యానికీ, న్యాయానికీ కట్టుబడ్డతిండీ, గుడ్డా, చదువూ, స్వేచ్ఛా యివన్నీ నాకు చనిపోయేవరకూ వున్నై. ఐనా నేనెప్పుడు విచారంగా వుండేవాణ్ణంటే దానికి కారణం అవసరంగా జరిగే జీవహింసా, కుంటీ గుడ్డీ మనుష్యుల అసహాయత్వం, వాళ్ళ వేదనతో కూడుకున్న బరువైన బ్రతుకులూనూ. నేననుకుంటూవుండేవాణ్ణి: చెట్టుచేమలకు శాకాహారులూ, వాళ్ళకి ఆహారం యిస్తూన్న ప్రాణులకు మాంసాహారులూ ఎల్లవేళలా కృతజ్ఞులై ఉండాలని. స్వార్థంతోను, కుళ్లుతోను నూటికి తొంభైతొమ్మిది మంది మనుష్యులు బ్రతుకుతున్న జీవితాలను చూసినమీదట నాకు అలాంటి భూమ్మీద బ్రతకటానికి పూర్తిగా అయిష్టమేసింది, వెగటు వేసింది. నిజం చెప్పొద్దూ, నాకు నా చంద్రవాణి భూమిని వేదనగా తడుముతూ యిలా మొరపెట్టుకుంటున్నట్లు కలల్లో కనిపించేది:—‘అమ్మా, నేనీ దోపిడీగాళ్ళ స్వార్థాన్ని, దోయబడుతూన్న వాళ్ళ కష్టాల్ని చూసి సహించలేను. నన్ను నీలోకి తీసుకుపోవే’ అని. నాచంద్రవాణికి ఈవిషయాలు తెలుసనుకోను. తెలిసినా యిలా అన్నట్లు నేను నాసంస్కారాన్ని దానిలో జొనిపింపచేసిన తరువాతనే అంటే మీరర్థంచేసుకోగలరనుకుంటాను. నేను భూమినంతా, నా యిల్లుగాను, దానిమీది మనుష్యులంతా నాకు రక్తస్పర్శ కలవారుగాను చూశాను. నా చంద్రవాణిమీద ప్రేమ ఫలించదని నాకు మొదటినుంచీ తెలుసు, కనుకనే నా మనస్సును చంద్రవాణినుంచి మరలించగల శక్తి భూమ్మీద ఏదైనా ఉంటే దానికి ఎంతో కృతజ్ఞుణ్ణయి వుండేవాణ్ణి. నాకు చంద్రవాణిమీది ప్రేమలో అది నడిచినదారి,

పలికిన పలుకులు, పసిపిల్లలాంటి దాని పవిత్రతతో కూడిన తత్వం-అంతా ఒక అర్థాన్నిస్తూ కనిపించేది. చంద్రవాణి మీద యింత ప్రేమను నువ్వు ఎలా నిగ్రహించుకో గలిగావు? అని మీరడగవచ్చు. ఈ ప్రశ్నకు నేనిలా సమాధానం యిస్తాను: అదీ దాని మీది ప్రేమవల్లే. నేను దాన్ని యింతగా ప్రేమిస్తున్నాననే అంశం తెలిస్తే అది ఎంతబాధను పొందుతుందో నాకు తెలుసు. ఒక విషయం చెబుతాను: చంద్రవాణి ఒకసారి మనిషిలాగే బండిలో కూర్చొటంచూసి ఆబండిని నేనే లాగాలనుకొని బలవంతాన ఆకోరికను అణుచుకున్నాను. నామనస్సు వేదనలో పడిపోయిందనుకుంటాను. నా శరీరతత్వం చిత్రంగా వుండేది. నాకేవిషయమైనా బాధను కలిగిస్తే దాన్ని సహించగల శక్తి వుండేదికాదు, కాని నాకేమీ బాధలేక పోతే అబాధలేక పోవటమనే విషయమే ఒకబాధను కలగచేస్తూ వుండేది. అప్పుడు నాశరీరంలో ఒక భాగాన్నికోసి దానికి తడిగుడ్డలు కట్టాలనిపించేది. ఇలాంటి నామనస్తత్వంలో నేను జీవితంలో ఏమీ మిగలనట్లు, పిచ్చిగా, జీవశక్తిని కోల్పోయి చనిపోవాలనుకున్నానంటే అదేమీ వింత కాదనుకుంటాను. నా మెదడు దేనికో ఇరవై నాలుగు గంటలూ పనిచేసేది. చంద్రవాణి మీద నాప్రేమ మొట్టమొదటిదశలో నామనస్సుదాన్ని జ్ఞాపకంచేసినంత మాత్రానే నాజీవశక్తి కామంతో కట్టలుతెగి ప్రవహించేది. ఈదశలో నేను చంద్రవాణి చిత్రాలను ఉద్రేకంతో గట్టిగా, చాలాసేపు ముద్దుపెట్టుకునే వాణ్ణి. మరి యిక రెండోదశ పూర్తిగా దీనికి వ్యతిరేకం. చాలా అతిశయంగా చెప్పాలంటే ఈ దశలో అజ్ఞాతంగా, బద్ధకంగా వున్న నాప్రేమ చాల్లా అరుదుగా చిగుళ్లువేసి కామంతో చంద్రవాణినిగూర్చి మథనపడేది, అవురుమనేది. ఐతే మీరడగవచ్చు: నీశరీరం, ఆత్మ చంద్రవాణినే కామంతోను, ప్రేమతోను కాంక్షించాయన్నమాట? అని. ఈమీ మెప్పుకూ, అభినందనకూ నేను తగనని మీకు సమాధానం యిస్తున్నాను. నా ఆశయమూ, అభిలాషకూడా అదే. కాని నాకు సాశీలంకూడా దక్కలేదు. కామం నానిగ్రహశక్తికి మించి, పట్టు తప్పిపోగా, నేను చాలా మంది ఆడవాళ్ళతో వ్యభిచరించాను కూడా. దానికనే నేను చాలా పాపం తెలిసి చేసిన మనిషినని చెబుతున్నాను. యిది నా మొదటి దశలో. నేనీదశలో ఎంత ఉద్రేకంగా కామంతో ఉండేవాణ్ణంటే నేనాశ్చర్య పడేవాణ్ణి: మగవాడు ఆడదాన్ని ఎలా ముద్దుపెట్టుకోగలడా! ఆడదాని స్పర్శకే ఆవేశంతో మగవాడి ఉద్రేకం కట్టలు తెంచుకుని ప్రవహించదా అని. కాని, నాప్రేమ రెండో దశలో దీనికి పూర్తిగా వ్యతిరేకంగా నన్నే ఆడమనిషీ ఆకర్షించలేక పోయింది. నేనీదశలో కొంచం విచారించేవాణ్ణి: కనీసం ఒకరిద్దరు సంతానం కలిగిన తరువాత రావాల్సిన పెరుగుదల, ముసలితనం మానసికంగాను, భౌతికంగాను నాకిప్పుడే వచ్చిందేమిటి? ఈస్థితి నామంచికి వచ్చిందా, చెడుకువచ్చిందా? అని. కాని నేనొకటి నమ్ముతాను. ఆడవాళ్ళ గొడవ నుంచి విముక్తయి బయటపడితేనే గాని ఏమీ మంచి పని యితరులకు చేయలేమని నేను నమ్ముతాను. కాని చిత్రమేమిటంటే యిలాంటి దశలోకూడా నామనస్సు నిత్యం చంద్రవాణికోసం పరితపించేది. పీకులాడేది. నాస్థితి ఇలా ఐందేమిటి? నేనింత పిచ్చివాణ్ణయినానేమిటి? నాకిప్పుడూ నాధ్యాసే ఏమిటి? నిజంగా నాశరీరానికి పక్షపాతం వచ్చిందా? నా శరీరమంతా నాదికానట్లు, 'నేను' వేరైనట్లు నాకు నిత్యం అనిపిస్తున్నదేమిటి? నామనస్సు నేను చెప్పినట్లు వినక యిలా విరిగిపోయినట్లు, తెగిపోయినట్లు వున్నదేమిటి? నాకు ఏపనీ చెయ్యబుద్ధిపుట్టదేమిటి? బద్ధకస్తుడు, పనిచెయ్యనివాడు అన్నం తిని బ్రతుకుతున్నాడంటే అది తప్పనీ, దొంగతనం లాంటిదనీ నాకు తెలీను!...ఇలా ఇలా అనుకుంటూ వుండేవాణ్ణి. ఇదంతా మీకళ్ళల్లో కరుణ కనిపిస్తున్నది. కనుక చెబుతున్నాను. మీరు సానుభూతితో వింటున్నారు గనుక ఇలా వాగుతున్నాను. ఐతే నాకొక్కటి చెప్పండి, కెక్కడ ఉన్నాను? ఇదం

తా వింతగా ఉన్న విషయంకూడా నన్ను వీసమెత్తూ ఆకర్షించ లేకపోయిన సంగతి మీ.. గమనించినట్లున్నారు. నాలో జీవం పోయిగ..పయం ఏమున్నా వినగలనేమో చెప్పండి. యింత నిర్మలత్వం, ప్రశాంతతగల ప్రదేశాన్ని గురించి కొంచం చెప్పండి, వింటాను."

"దీన్ని మీరు 'స్వరం' అని మాలాగా పిలువవచ్చును. కాని ఒక విషయాన్ని మీరు చెప్పలేదు. చిత్రంగావుంది. మీరు చనిపోయేముందు చంద్రవాణీ, ఆమె భర్తా ఎలావున్నారు? దీనికి సమాధానం చెప్పండి, నేను మీకు చాలా ప్రియమైన విషయాన్ని చెప్పగల ననుకుంటాను."

"అవును! ఈవిషయం చెప్పటం మరిచాను. నాకీ విషయం బొత్తిగా తెలీదు. నేను చనిపోకముందు రెండేళ్ళ క్రితమే వాళ్లు అంతవరకు నివశించిన గడ్డను వదిలి చాలా దూరదేశానికి వెళ్ళిపోయారు. అదే ఆఖరిసారి నేను చంద్రవాణిని చూడటం. ఒక విషయంమాత్రం నేను చక్కగా ఒప్పుకుంటాను. అదేమిటంటే చంద్రవాణి భర్త చాలా పెద్దమనిషీను, అన్నివిధాలా దాన్ని పెంపొందటానికి అర్హుడూను. అలాంటి యోగ్యులు చాలా కొద్దిమంది భూమ్మీద ఉంటారనుకుంటాను. దానికనే నేను చంద్రవాణి విషయమై సంబరపడ్డాను. నాకీ ప్రేమే లేకపోతేనా అంత ఆ భార్యాభర్తల సౌఖ్యాన్నీ, కుశలాన్నీ, కోరిన మనిషి ఆభూమ్మీద యెవ్వరూ లేరని ఖచ్చితంగా చెప్పగలిగేవాణ్ణి. ఐనా వాళ్ల విషయమేమున్నా మీకు తెలుసా? త్వరగా చెప్పండి?

"అవును! తెలుసు. వాళ్ళిద్దరూ యిక్కడే వున్నారు. మీరు చంద్రవాణిని చూచిన సంవత్సరం తరువాత ఆమెభర్త మీభూమ్మీది మతకలహాల్లో ఎవ్వరినో యిద్దర్ని విడదీస్తూ బలమైన గాయాలు తగలగా చనిపోయాడు. ఆపైన సంవత్సరం పొడుగూతా భర్తకోసం ఊరికే అదేపనిగా పరితపించి, చిక్కి శల్యమై చంద్రవాణి అమిత చిత్రంగా మీరు చనిపోయినప్పుడే చనిపోయింది. నాకు నవ్వొస్తుంది. ఒక విషయంమాత్రం నిజం. మీరు మీచంద్రవాణినే ప్రేమించి ఎప్పుడూ ఆమెనే ఏలాతలిచారో, అలాగే చంద్రవాణి ఆమె భర్తనే ప్రేమించి, ఆయనే కోసమే బ్రతికింది. నేనిందాకనే చూశాను వాళ్లిద్దరినీ, చంద్రవాణి తనదగ్గరికి రావటానికి ఆమెభర్త ఏమీ సంతోషాన్ని పొందలేదు. నువ్వు నాకోసం, అంత బెంగపెట్టుకుని మధనపడ్డావెందుకు? నువ్వు నేను చనిపోయిన తరువాత మనిషికీ, దేవుడికీ పవిత్రంగా సేవచేస్తూ బ్రతక్కపోయావూ? ఈ తుచ్ఛమైన శారీరకమైన భార్యాభర్తల సంబంధమే శాశ్వతంగా యెప్పుడూ వుండాలని. ఇదే పెద్ద ఆదర్శంగాను, ఆశయంగాను దేనిని కోరుతూ మొక్కులు మొక్కుతున్నావు? నీకీమాత్రం జ్ఞానం లేకపోయిందేమిటి? అని చంద్రవాణిని ఆమెభర్త నిందించాడు, మీరు అన్యధా తలచకపోతే ఒకటి చెబుతాను. ఆయన అన్నముక్క చంద్రవాణిపట్లా, మీపట్లా కూడా నిజం. మీమాటకొస్తే మీరు మీసంఘుత్యవసనుచూసి అసహ్యించుకున్నారే కాని దాన్ని బాగు చేద్దామని ప్రయత్నించలేదు."


మహాభల్లాతకి లేహ్యాము

సమస్త కుష్టములను సమూలముగా
నాశనమొనరించు దివ్యౌషధము.

పొడలు. కొరకములు, మేహరోగములు, గ్రంథులు మొదలగునవి 10 మోతాదులలో నివారణమగును.

40 దినములకు సరిపోవు మందు రూ. 8-0-0
అనుపాన కషాయము రూ. 4-0-0

మోచాకంద రసాయనము

మలబద్ధకము, ఆసనమునందు దురద, బైటకు వెళ్లునపుడు రక్తముపడుట, మొలకలు మొదలగు సర్వవిధముల మూలములను కుదుర్చును.

20 తు॥ డబ్బా రూ. 8-0-0.

ఆర్య వైద్య మందిరం,
(డా॥ డి. వరసింహాచార్యులు)
ఈగవారిపాలెం (P. O. చెంగల్పట్టు జిల్లా.